మానేరు జలాశయంపై వంతెన నిర్మించండి

- కలెక్టరేట్ ఎదుట బ్రిడ్జి సాధన జేఏసీ నిరసన దీక్ష

కలెక్టరేట్ ఎదుట ప్లకార్డులు ప్రదర్శిస్తున్న జేఏసీ ప్రతినిధులు

కలెక్టరేట్, నవంబర్ 11: మానేరు జలాశయంపై వంతెన నిర్మించాలని బ్రిడ్జి సాధన సమితి జేఏసీ ప్రతినిధులు సోమవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. జేఏసీ కన్వీనర్ సంపతి ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో బెజ్జంకి, ఇల్లంతకుంట, గన్నేరువరం మండలాల ప్రజలు, జేఏసీ ప్రతినిధులు భారీగా తరలివచ్చి ఉదయం 10నుంచి సాయంత్రం 4గంటల వరకు నిరసన దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ, జిల్లా కేంద్రానికి వచ్చేందుకు నాలుగు దశాబ్దాలుగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. మానేరు జలాశయం చుట్టూ తిరిగి కరీంనగర్ రావాల్సి వస్తోందని ఆవేదన చెందారు. జలాశయం నిర్మాణానికి ముందు నేరుగా నగరానికి వచ్చేవారమని, ప్రస్తుతం 40కిలోమీటర్లకు పైగా దూరం చుట్టూ తిరిగి వస్తున్నట్లు వాపోయారు. గన్నేరువరం నుంచి కరీంనగర్‌కు నేరుగా బ్రిడ్జి నిర్మిస్తే సగం దూరం తగ్గి, తక్కువ సమయంలోనే జిల్లా కేంద్రానికి చేరుకునే అవకాశం ఉందన్నారు. జలాశయ నిర్మాణ సమయంలో గన్నేరువరం నుంచి నగరానికి బ్రిడ్జి నిర్మిస్తామని హామీ కూడా ఇచ్చినట్లు తమ పూర్వీకులు పేర్కొంటుండగా, ఆ హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. వంతెన నిర్మాణం జరిగితే మూడు మండలాల్లోని సుమారు 20గ్రామాల ప్రజలకు రాకపోకలు సులువవుతాయని స్పష్టంచేశారు. శ్మశానవాటిక వెనుక వైపు నుంచి జలాశయం మధ్యలో మైసమ్మ గుట్ట వరకు 1.25కిలోమీటర్ల పొడవు బ్రిడ్జి నిర్మిస్తే, గుట్ట ప్రాంతంలో ముంపు లేకుండా ఉన్న మూడు వేల ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా వివిధ అవసరాలకు వినియోగంలోకి తేవచ్చన్నారు. 2013 నుంచి అధికారులకు ఎన్నో విజ్ఞప్తులు చేస్తున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. నిరసన దీక్షలో పలు గ్రామాల ప్రజలు, బ్రిడ్జి సాధన జేఏసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పారిశ్రామిక అభివృద్ధిలో విద్యుత్ శక్తి పాత్ర కీలకం

కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వీ సతీశ్‌కుమార్

హుజూరాబాద్ రూరల్, నవంబర్11: పారిశ్రామిక అభివృద్ధిలో విద్యుత్ శక్తి ప్రధాన భూమిక వహిస్తుందని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే, కిట్స్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వొడితల సతీశ్ కుమార్ పేర్కొన్నారు. సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏఐసీటీఈ ప్రయోజిత అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను సోమవారం నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ కే శంకర్ అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి సతీశ్ కుమార్ హాజరై మాట్లాడుతూ.. రాబోయే కాలంలో సంప్రదాయేతర ఇంధన వనరులు సౌర, పవన విద్యుత్తును విరివిగా వాడవలసి వస్తుందని, విద్యార్థులు అధ్యాపకులు ఆ సాంకేతిక విజ్ఞానాన్ని నేర్చుకోవడం వల్ల ఉద్యోగాలు పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో ముఖ్య శిక్షకుడిగా హైదరాబాద్‌కు చెందిన రిట్రాన్ టెక్నాలజీస్ డైరెక్టర్ ఎన్. రామచందర్ హాజరై విద్యార్థులు, అధ్యాపకులకు శిక్షణ ఇచ్చారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. ఈశ్వరయ్య, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ యోగేష్ పుండలిక్, డాక్టర్ ఏ. కొమురయ్య, వివిధ విభాగాల అధిపతులు, వివిధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా చేయాలి

కార్పొరేషన్, నవంబర్ 11: నగరంలో ఇంటింటి సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలని నగర కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం నగరంలో సాగుతున్న ఇంటింటి సర్వేను ఆమే పరిశీలించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సమగ్రంగా వివరాలు సేకరించాలని సూచించారు. ఎక్కడా ఇబ్బందులు కలుగకుండా పూర్తి స్థాయిలో సర్వే విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

- జిల్లా ప్రత్యేక అధికారి ఆర్వీ కర్ణన్
- వివిధ మండలాల్లో కొనుగోలు కేంద్రాలు, సర్వే పరిశీలన

మానకొండూర్: కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి నిర్వాహకులకు సూచనలు ఇస్తున్న జిల్లా ప్రత్యేకాధికారి ఆర్వీ కర్ణన్

మానకొండూర్/రూరల్/ తిమ్మాపూర్/ శంకరపట్నం, నవంబర్ 11: కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని విక్రయించడానికి తీసుకువస్తున్న రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని, ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని జిల్లా ప్రత్యేక అధికారి ఆర్వీ కర్ణన్ ఆదేశించారు. సోమవారం మానకొండూర్ ఏఎంసీ ఆవరణలో, శంకరపట్నం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రాలకు రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని పరిశీలించారు. ఇప్పటి వరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారు అని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో రైతులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలు, ట్రాన్స్‌పోర్టు, తదితర వివరాలపై ఆరా తీశారు. అనంతరం మానకొండూర్ మండల కేంద్రంలోని ముదిరాజ్ కాలనీ, ఎస్టీ కాలనీ, చెంజర్ల, తిమ్మాపూర్ మండలం అల్గునూర్, శంకరపట్నం మండలం వంకాయగూడెంలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యులందరూ ఉన్నప్పుడే సర్వే చేయాలని ఎన్యుమరేటర్లకు సూచించారు. ఆయా చోట్ల జరిగిన కార్యక్రమాల్లో కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్లు ప్రపుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, జిల్లా సివిల్ సప్లైస్ డీఎం రజినీకాంత్, డీఎస్‌వో భాగ్యలక్ష్మి, డీసీవో రామానుజాచారి, డీసీఎస్‌వో నర్సింగరావు, ఆర్డీవో రమేశ్ బాబు, డీపీవో రవీందర్, మెప్మా పీడీ స్వరూపారాణి, మానకొండూర్ మండల ప్రత్యేకాధికారి, డీఆర్డీవో శ్రీధర్, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో పాటు సింగిల్‌విండోల అధ్యక్షులు నల్ల గోవిందరెడ్డి, మధూకర్‌రెడ్డి, సీఈవో లక్ష్మారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చొప్పదండి వైద్య సిబ్బందికి కలెక్టర్ అభినందన

వైద్య సిబ్బందిని అభినందిస్తున్న కలెక్టర్

విద్యానగర్, నవంబర్ 11 : చొప్పదండి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్య సిబ్బందిని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సోమవారం కలెక్టర్ పమేలా సత్పతి ఘనంగా సన్మానించారు. శనివారం ఒకే రోజు రెండు సాధారణ ప్రసవాలు జరిగేందుకు కృషిచేసిన చొప్పదండి వైద్యాధికారి శ్రీ కీర్తన, సూపర్‌వైజర్ శ్రీదేవి, సీహెచ్‌వో వెంకటస్వామి, ఏఎన్‌ఎంలు విజయలక్ష్మి, పుష్పలత, దేవేంద్ర, ఎస్సేన్లు వసంత, పద్మలత, భాగ్య, ఆశ కార్యకర్తలు వసంత, అనసూయను కలెక్టర్ శాలువాలతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, అదనపు వైద్యాధికారి డాక్టర్ సుజాత, డీసీహెచ్ చంద్రశేఖర్, ఎంసీహెచ్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సనా, వైద్యాధికారులు ప్రణవ్ రమేశ్, మధుకర్, శ్వేత ప్రియ, శ్రావణ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇది కొమురం భీమ్ స్ఫూర్తి

- ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ బీఎన్ రావు

విద్యానగర్, నవంబర్ 11 : కొడంగల్ నియోజకవర్గంలో రైతులు చేసిన తిరుగుబాటు కొమురం భీమ్ స్ఫూర్తి, పోరాటాన్ని గుర్తుకు తెస్తుందని ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ బీఎన్ రావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇది అస్తిత్వ పోరాటమని, దాని ముందు ఏ శక్తులూ పనిచేయవని చెప్పారు. ఏ ప్రభుత్వ అణచివేత పనిచేయదని, ఎంత అణచివేస్తే పోరాటం అంత ఉగ్రరూపం దాల్చుతుందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఆలోచనల్లో మార్పు రావాలని, ఫార్మాసిటీ ఏర్పాటుకు స్వస్తి చెప్పాలని, రైతులకు న్యాయం చేయాలని సూచించారు. ప్రభుత్వం అంటే ప్రజలను అణచివేయడం, భయభ్రాంతులకు గురిచేయడం కాదని, ప్రజల పక్షాన నిలబడి వారి జీవన ప్రమాణాలు పెంచేలా చూడాలని పేర్కొన్నారు.

మృత్యుంజయురాలు దివ్యశ్రీ

- హుజూరాబాద్ మండలం సింగాపూర్ వద్ద రోడ్డు ప్రమాదం
- లారీ కింద ఇరుక్కున్న మహిళ
- కొద్ది దూరం ఈడ్చుకెళ్లిన లారీ.. తీవ్ర గాయాలు
- కరీంనగర్‌లోని ప్రైవేట్ దవాఖానకు తరలింపు

రోడ్డుపై లారీ కింద ఇరుక్కుపోయిన దివ్యశ్రీ

హుజూరాబాద్ టౌన్, నవంబర్11 : చావు అంచుల దాకా వెళ్లిన ఓ మహిళ ప్రాణాలతో బయటపడింది. రోడ్డు ప్రమాదంలో లారీ కింద ఇరుక్కున్న మహిళ కొద్ది దూరం ఈడ్చుకెళ్లగా స్థానికులు గమనించడంతో ప్రాణాపాయం తప్పింది. హుజూరాబాద్ మండలం సింగాపూర్ సమీపంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హుజూరాబాద్ మండలం సింగాపూర్ గ్రామ శివారులోని కరీంనగర్–వరంగల్ రహదారిపై మానకొండూరు మండలం కల్లెడ గ్రామానికి చెందిన దివ్యశ్రీ, ఆమె భర్త ఇద్దరు పిల్లలతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. సింగాపూర్ శివారు వద్ద ద్విచక్ర వాహనం పైనుంచి దివ్యశ్రీ అదుపు తప్పి కింద పడింది. ఆ సమయంలో వెనుక నుంచి వస్తున్న లారీ టైర్ కింద ఆమె వెంట్రుకలు ఇరుక్కోగా కొద్దిదూరం ఈడ్చుకెళ్లింది. స్థానికులు కేకలు వేయడంతో గమనించిన డ్రైవర్ లారీని నిలిపేశాడు. ఇదే సమయంలో అటుగా వెళ్తున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆగి తీవ్ర గాయాలపాలైన దివ్యశ్రీకి ధైర్యం చెప్పారు. ఆయన సూచన మేరకు సిబ్బంది మహిళ జుట్టును కత్తిరించి బయటకు తీశారు. తల్లికి రక్తం రావడం చూసిన పిల్లలు బోరున విలపించారు. మహిళను కరీంనగర్‌లోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. దివ్యశ్రీకి అయ్యే వైద్య ఖర్చును తానే చెల్లిస్తానని దవాఖాన వైద్యులకు ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ తెలిపారు.

అమృత్ మిత్రల నియామకంలో నిర్లక్ష్యం

- నిధులు ఉన్నా పట్టింపులేని అధికారులు
- ఆసక్తి చూపుతున్న స్వశక్తి సంఘాలు

నగరాలు, పట్టణాల్లో నీటి సరఫరాలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలన్న ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న అమృత్ మిత్రల విషయంలో నగరపాలక ఉన్నతాధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. ఈ పథకం కింద పూర్తిస్థాయిలో నిధులు ఉన్నా వాటిని వినియోగించడంలో మాత్రం ఇంజినీరింగ్ అధికారులు పట్టింపు లేనట్లుగా వ్యవహరిస్తున్నారు.

-కార్పొరేషన్, నవంబర్ 11

నగరాలు, పట్టణాల్లో చేపడుతున్న నీటి సరఫరా విషయంలో అత్యధికంగా నీరు వృథా కావడం, లీకేజీలు, ఆ మేరకు ఆదాయం రాకపోవడం వంటి సమస్యలు వస్తూనే ఉన్నాయి. వీటన్నింటికి చెక్ పెట్టేలా పూర్తిస్థాయిలో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ ముందుకు తీసుకెళ్లాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగానే అమృత్ 2 పథకంలో భాగంగా మంచి నీటి సరఫరాను స్వశక్తి సంఘాల ద్వారా నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది. నిధులు సైతం కేటాయించింది. అయితే మహిళా సంఘాలను గుర్తించి వాటికి బాధ్యతలు అప్పగించే విషయంలో ఇంజినీరింగ్ అధికారులు అంతగా శ్రద్ధ చూపడం లేదు. ఇలాగే వ్యవహరిస్తే వచ్చిన నిధులు కూడా వెనక్కిపోయే పరిస్థితి వస్తుందని ఇంజినీరింగ్ అధికారులే చెబుతున్నారు. మరి ఉన్నతాధికారులైనా ఈ విషయంలో దృష్టిసారించి అమృత్ మిత్రల నియామకానికి ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది.

నగరంలో ఐదు ప్రాజెక్టులు

నగరపాలక సంస్థ పరిధిలో రూ.50 లక్షల వ్యయంతో ఐదు ప్రాజెక్టులు చేపడుతున్నారు. నగరంలోని జ్యోతినగర్, హౌసింగ్‌బోర్డు కాలనీ, మార్కెట్, రాంనగర్ రిజర్వాయర్లతో పాటు శాతవాహన యూనివర్సిటీలోని బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో ల్యాబ్ పనులు దీనిలో చేర్చారు. ఈ రిజర్వాయర్ పరిధిలోని మంచినీటి సరఫరాకు సంబంధించి పూర్తిస్థాయిలో నిర్వహణ చేపట్టాల్సి ఉంటుంది. ప్రత్యేకంగా నీటి నిర్వహణలో ఇంజినీరింగ్ అధికారులు కూడా సమన్వయంతో పని చేస్తారు. ఈ పనుల కోసం ఇప్పటికే స్వశక్తి సంఘాల నుంచి ప్రతిపాదనలకు చర్యలు చేపడుతున్నారు. ముందుకు వచ్చే సంఘాలకు ఈ బాధ్యతలు అప్పగించే దిశగా ఇంజినీరింగ్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

చేయాల్సిన పనులు

ఈ పథకంలోఎంపిక చేసిన సంఘాలను అమృత్ మిత్రలుగా నియమిస్తారు. ఈ మిత్రలు తమ పరిధిలో నీటి నిర్వహణే ప్రధాన లక్ష్యంగా పని చేయాల్సి ఉంటుంది. తమ పరిధిలోని ప్రతి ఇంటికి మెరుగైన తాగునీరు అందించేలా పర్యవేక్షించడంతో పాటు ఆయా ఇళ్లల్లో నీటి వృథాను అరికట్టేందుకు ప్రజలకు అవగాహన కల్పిస్తారు. నీటి వినియోగం మీటర్ల ఏర్పాటు, లీకేజీల నివారణలోనూ మిత్రలు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుంది. నీటి నిర్వహణ సరఫరాలో మిత్రలు పూర్తి బాధ్యతలను తీసుకుంటూ ప్రజలకు, పట్టణ, స్థానిక సంస్థలకు అనుసంధానంగా వ్యవహరించాల్సి ఉంటుంది. నీటి నిర్వహణలో ఎలాంటి అక్రమాలకు చోటు లేకుండా పారదర్శకంగా పర్యవేక్షించాలి. పార్కులు, మురుగు జలాల శుద్ధి కేంద్రాలు, మానవ వ్యర్థాల శుద్ధి కేంద్రాల నిర్వహణ తీరును మిత్రలు పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఆయా విభాగాల నిర్వహణను మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజల అభిప్రాయాలు సేకరించి వాటికి అనుగుణంగా సమస్యలు పరిష్కరించే దిశగా ప్రతిపాదనలు చేయాల్సి ఉంటుంది.

అమృత్ మిత్రల ఎంపికకు అర్హతలు

అమృత్ మిత్రల ఎంపిక కోసం సంబంధిత స్వశక్తి సంఘం తప్పనిసరిగా నేషనల్ అర్బన్ లైవ్ లీహుడ్ మిషన్ (ఎన్‌యూఎల్‌ఎం)లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. అలాగే ఆయా నిబంధనల అమలు చేస్తూ, క్రమం తప్పకుండా సమావేశాలు జరుపాలి, పొదుపు అంతర్గత రుణ సాయం, రుణాల చెల్లింపు రికార్డుల నిర్వహణ తదితర పద్ధతులు పాటించాలి. సంబంధిత స్వశక్తి సంఘంలో కనీసం ఒకరు 8వ తరగతికి పైగా చదువుకొని ఉండాలి. సంఘం సభ్యులపై ఎలాంటి క్రిమినల్ కేసులు ఉండకూడదు. గతంలో నీటి నిర్వహణలో పాల్గొన్న స్వశక్తి సంఘాలకు ప్రాధాన్యత ఇస్తారు. అత్యంత మెరుగుగా పని చేసి తాగునీరు, మురుగు జలాల శుద్ధి, పార్కుల నిర్వహణలో అత్యంత ప్రతిభ చూపించిన వారికి అమృత్ మిత్రలకు ప్రత్యేక అవార్డులను ప్రభుత్వాలు అందించనున్నాయి.

విదర్భలో విజేతదే మహా పీఠం

- ఇక్కడ 62 అసెంబ్లీ నియోజకవర్గాలు
- ఈ ప్రాంతంలో పట్టు సాధిస్తే అధికారం పక్కా
- ప్రత్యేక దృష్టి సారించిన రెండు కూటములు

ముంబై, నవంబర్ 11(నమస్తే తెలంగాణ): మహారాష్ట్ర ఎన్నికలు సమీపిస్తున్న వేళ రెండు కూటములు విదర్భ ప్రాంతంపై ప్రత్యేకంగా దృష్టి సారించాయి. 62 నియోజకవర్గాలు ఉన్న విదర్భలో పాగా వేస్తే అధికారానికి దగ్గరైనట్టే అని కూటములు లెక్కలు వేసుకుంటున్నాయి. ఇక్కడి ప్రజలను ఆకర్షించి మెజార్టీ సీట్లు తమ ఖాతాలో వేసుకోవాలని తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ఇప్పటికే రెండు కూటముల నుంచి అగ్రనేతలు విదర్భ మొత్తాన్ని చుడుతూ ప్రచారం చేస్తున్నారు. ఎక్కువగా పత్తి పండించే రైతులు ఉన్న ఈ ప్రాంతంలో రైతులు ఎటువైపు నిలుస్తారనేది గెలుపోటములను నిర్ణయించనుంది.

రెండు కూటములకూ కీలకం

విదర్భలోని మొత్తం 62 స్థానాల్లో బీజేపీ, కాంగ్రెస్ 36 స్థానాల్లో ప్రత్యక్షంగా తలపడుతున్నాయి. 11 జిల్లాలు కలిగిన విదర్భ ప్రాంతం 1990ల వరకు కాంగ్రెస్‌కు కంచుకోట. మూడు దశాబ్దాలుగా ఇక్కడ బీజేపీ – శివసేన కూటమి పట్టు పెంచుకుంది. 2014లో ఇక్కడ బీజేపీ ఒంటరిగా పోటీ చేసి 44 స్థానాలను గెలుచుకుంది. 2019లో 29 స్థానాలకు పడిపోయింది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ) ఇక్కడ మంచి ఫలితాలను సాధించింది. విదర్భలోని 10 లోక్‌సభ స్థానాల్లో ఏడు స్థానాలను కైవసం చేసుకుంది. దీంతో అసెంబ్లీ ఎన్నికల్లో విదర్భలో పాగా వేసేందుకు ఎంవీఏ ప్రయత్నిస్తున్నది. ఆరెస్సెస్ కేంద్ర కార్యాలయం విదర్భలోనే నెలకొని ఉండటం, రాష్ట్ర బీజేపీకి జోడుగుర్రాల్లాంటి దేవేంద్ర ఫడ్నవీస్, చంద్రశేఖర్ బవాంకులే ఈ ప్రాంతానికి చెందిన వారే కావడంతో బీజేపీ ఈసారి విదర్భ ప్రాంతాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నది.

మేఘాల్లోనూ మైక్రోప్లాస్టిక్

- పర్యావరణాన్ని ప్రభావితం చేస్తుందొచ్చు
- శాస్త్రవేత్తల ఆందోళన

న్యూఢిల్లీ: భూమిని మొత్తం ఆక్రమించేసిన మైక్రోప్లాస్టిక్స్ మేఘాల్లోకీ చేరాయని, ఇవి పర్యావరణాన్ని సైతం ప్రభావితం చేస్తుండొచ్చని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు సంబంధించి అమెరికాలోని పెన్సిల్వేనియా స్టేట్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు చేసిన ఓ అధ్యయనంలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆకాశంలో మైక్రోప్లాస్టిక్‌లు మంచు కేంద్రక రేణువులుగా పని చేసి అసహజంగా మేఘాల ఏర్పాటుకు కారణమవుతున్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. సాధారణంగా మేఘాలు ఏర్పడే పరిస్థితులు లేకపోయినా మైక్రోప్లాస్టిక్‌లు మేఘాలు ఏర్పడేలా చేస్తాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని నిర్ధారించడం కోసం పరిశోధకులు నాలుగు రకాల మైక్రోప్లాస్టిక్‌లను ప్రయోగశాలలో పరీక్షించారు. ఇందుకోసం నీటి బిందువులను చల్లబరిచి మంచుగా మార్చారు. మైక్రోప్లాస్టిక్ లేని నీటి బిందువులు మైనస్ 38 డిగ్రీల సెల్సియస్ వద్ద గడ్డ కట్టగా, 50 శాతం మైక్రో ప్లాస్టిక్‌లతో కలుషితమైన నీటి బిందువులు మైనస్ 22 డిగ్రీల సెల్సియస్ వద్దనే గడ్డ కడుతున్నట్టు తెలుసుకున్నారు. కాబట్టి మైక్రో ప్లాస్టిక్‌లు మేఘాల నిర్మాణాన్ని ప్రభావితం చేస్తున్నాయని అర్థమవుతున్నదని శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఫ్రీడ్‌మన్ తెలిపారు.

ఇజ్రాయెల్‌పై హెజ్బొల్లా రాకెట్ల వర్షం

90కి పైగా క్షిపణుల ప్రయోగం • పలువురికి గాయాలు • ధ్వంసమైన వాహనాలు

హెజ్బొల్లా రాకెట్ దాడులతో ఇజ్రాయెల్‌లోని హైఫాలో దహనమవుతున్న కార్లు

బీరుట్, నవంబర్ 11: ఇజ్రాయెల్–హెజ్బొల్లా మధ్య పోరు మరింత తీవ్రరూపం దాల్చింది. లెబనాన్‌లోని హెజ్బొల్లా గ్రూప్ సోమవారం ఇజ్రాయెల్‌పై వరుస రాకెట్ దాడులతో విరుచుకుపడింది. ఇజ్రాయెల్ నగరం 'హైఫా' లక్ష్యంగా 90కిపైగా క్షిపణులను ప్రయోగించింది. ఈ దాడుల్లో హైఫాలో పలు భవనాలు దెబ్బతిన్నాయని, పలువురు గాయపడ్డారని, వాహనాలు ధ్వంసమయ్యాయని మీడియా కథనాలు పేర్కొన్నాయి. హెజ్బొల్లా ప్రయోగించిన పలు మిస్సైల్స్‌ను ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థ 'ఐరన్ డోమ్' అడ్డుకున్నప్పటికీ, మరికొన్ని హైఫాలో పలు జనావాస ప్రాంతాల్ని తాకాయని తెలిసింది. ఒక చిన్నారి సహా నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారని ప్రాథమిక సమాచారం. హెజ్బొల్లా రాకెట్ దాడుల్ని ఇజ్రాయెల్ భద్రతా బలగాలు (ఐడీఎఫ్) ధ్రువీకరించాయి. హైఫా పట్టణం శివారు ప్రాంతాల్ని మిస్సైల్స్ తాకాయని ఐడీఎఫ్ పేర్కొన్నది.

శ్మశానం కింద హెజ్బొల్లా సొరంగం!

హెజ్బొల్లా సభ్యులు ఉపయోగించే సొరంగాలను ధ్వంసం చేసినట్టు ఇజ్రాయెల్ సైన్యం(ఐడీఎఫ్) ఆదివారం తెలిపింది. వీటిలో ఒకటి శ్మశానం కింద ఉందని ఆరోపించింది. కిలోమీటర్ పొడవున ఉండే ఈ సొరంగాలను గుర్తించామని ఎక్స్‌లో ఒక వీడియోను పోస్ట్ చేసింది. ఈ సొరంగాల్లో కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్స్, నిద్రించే గదులు, ఆయుధగారాలు ఉన్నట్టు ఐడీఎఫ్ వెల్లడించింది. ఓ సొరంగంలో డజన్ల కొద్దీ ఆయుధాలు, ఇతర సైనిక సామగ్రి ఉన్న వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేసింది. 'ఉగ్రవాదుల అండర్ గ్రౌండ్ సొరంగాలను మా దళాలు ధ్వంసం చేశాయి. అందులో వ్యూహాత్మకంగా శ్మశానం కింద కూడా ఒకటి ఉంది. హెజ్బొల్లా మనుషులు చనిపోయినా, బతికున్నా వారికి విలువ ఇవ్వదు' అని ఐడీఎఫ్ విమర్శించింది.

ఇరాన్ రసాయన ఆయుధాల అభివృద్ధి!

ఇజ్రాయెల్ సైనికులు, పౌరులపై ప్రయోగించేందుకు ఇరాన్ రసాయన ఆయుధాల్ని సిద్ధం చేసిందన్న వార్తలు వెలువడ్డాయి. ఔషధ తయారీలో రసాయన ఏజెంట్స్‌గా వాడే సింథటిక్ ఓపియాయిడ్లు, ఫెంటానేల్.. వంటి వాటితో ఇరాన్ రసాయన ఆయుధాల్ని అభివృద్ధి చేసిందని అమెరికా రక్షణ రంగ నిపుణుడు మాథ్యూ లెవిట్ వెల్లడించారు. శక్తివంతమైన రసాయన ఏజెంట్స్‌తో గ్రనెడ్లు, బాంబులను ఇరాన్ తయారుచేసిందని, వీటి ప్రభావానికి లోనైతే.. బాధితుల నాడీ వ్యవస్థ కొన్ని క్షణాల్లో దెబ్బతింటుందని తెలిపారు. ఇజ్రాయెల్ సైన్యం, పౌరులు లక్ష్యంగా ఈ రసాయన ఆయుధాల్ని ప్రయోగించేందుకు ఇరాన్ తయారు చేసిందని చెప్పారు. దీనిపై ఆయన రాసిన ఆర్టికల్ చర్చనీయాంశమైంది. ఇరాన్ రసాయన ఆయుధాల తయారీని తక్కువ అంచనా వేయడానికి వీల్లేదని హెచ్చరించారు. రసాయన ఆయుధాల నుంచి వెలువడే పొగను ఒకసారి పీల్చిగానే, బాధితులు వెంటనే స్పృహ కోల్పోతారని, ఇజ్రాయెల్ సైనికులు, పౌరులను బందీలుగా చేసుకోవడానికి ఇరాన్ వాడొచ్చునని చెప్పారు.

భగత్‌సింగ్ ఓ ఉగ్రవాది: పాక్

లాహోర్: బ్రిటిష్ వలస పాలకులపై వీరోచితంగా పోరాడి, ప్రాణ త్యాగం చేసిన భగత్ సింగ్ పట్ల పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రభుత్వం దురహంకారంతో వ్యవహరించింది. ఆయనను గౌరవించేందుకు తిరస్కరించింది. షడ్మన్ చౌక్‌కు భగత్ సింగ్ పేరు పెట్టడాన్ని, ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకించింది. భగత్ సింగ్‌ను ఉగ్రవాదిగా పేర్కొనడంపై ఆమ్ ఆద్మీ పార్టీ ఘాటుగా స్పందించింది. దీనిపై పాకిస్థాన్‌ను వివరణ కోరాలని భారత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. బీజేపీ స్పందిస్తూ, పాకిస్థాన్ ఉగ్రవాదులకు ఆశ్రయమిస్తున్న విషయం అందరికీ తెలుసునని పేర్కొంది. భగత్ సింగ్‌ను అపఖ్యాతిపాలు చేయడం కోసం పాకిస్థాన్ నయవంచనకు పాల్పడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేసింది.



BLOCKBUSTER నేడే చూడండి
అప్పుడో ఇప్పుడో ఎప్పుడో
BVSN PRASAD SUDHEER VARMA
సప్తగిరి 70 ఎంఎం ఎ/సి - ఆర్‌టిసి క్రాస్ రోడ్స్
11.00,2.00,6.00,9.00
మెగా - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15,6.15,9.15
మహాలక్ష్మి క